క్లుప్తంగా

వృద్ధురాలికి ఆర్థికసాయం

ఒంగోలు అర్బన్: పేద వృద్ధురాలికి సూర్యశ్రీ ట్రస్ట్ సోమవారం రూ.8 వేల ఆర్థికసాయం అందజేసింది. స్థానిక అన్నవరప్పాడు కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధురాలు భవానికి కుటుంబ పోషణ నిమిత్తం ఎన్ఆర్ఐ రవికిరణ్ తుమ్మల సహకారంతో స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో ఆ మొత్తాన్ని అందించారు. ట్రస్ట్ సభ్యులు షేక్ సర్దార్ బాషా, మారెళ్ల సుబ్బారావు, చిక్కాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.202

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం–2లో సోమవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు గరిష్ట ధర రూ.202 పలికింది. వేలం కేంద్రానికి మొత్తం బేళ్లు 696 రాగా, 668 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆరు బేళ్లు నోబిడ్ కాగా, వేలం కేంద్రంలో తొలిసారిగా గరిష్ట ధర కిలో రూ.202 పలికింది. కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.199.71గా నమోదైనట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

మోదీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సంతనూతలపాడులో పాల్గొన్న బీజేపీ నాయకులు

చీమకుర్తి: ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కోటయ్య పిలుపునిచ్చారు. సోమవారం సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల్లోని బీజేపీ నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు, చీమకుర్తిలో వేరువేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఒంగోలు రూరల్: ఈ నెల 21వ తేదీ అనారోగ్యంతో మృతిచెందిన పోలవరపు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సాయం కింద రూ.10 వేల నగదును సోమవారం అందజేశారు. మృతుడి భార్య పోలవరపు లక్ష్మీశ్రావణికి కరవది ఎంపీటీసీ–1 మన్నె శ్రీనివాసరావు, సర్పంచ్ డి.కోటేశ్వరరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కాంతారావు చేతుల మీదుగా ఆ మొత్తాన్ని అందించారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్, అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ప్రతినిధులు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది ఎస్టీకాలనీలో ప్రమాదవశాత్తూ ఇల్లు అగ్నికి ఆహుతై కట్టుబట్టలతో మిగిలిన మాణికల శ్రీను, లక్ష్మిలకు అంబేడ్కర్ స్టడీ సర్కిల్, కరవది వారు సోమవారం ఉదయం ఆర్థిక సాయం అందజేశారు. కొన్ని రోజుల క్రితం మధ్యాహ్న సమయంలో ఇంట్లోని వారు లేని సమయంలో గృహం అగ్నికి ఆహుతైంది. వంటపాత్రలు, నిత్యావసర వస్తువులు, చేపలు పట్టే వలలు పూర్తిగా కాలి బూడిదవడంతో వేలాది రూపాయలు నష్టపోయి దిక్కుతోచని స్థితిలో రోడ్డునపడ్డారు. వారి దీనస్థితిని గుర్తించిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్ యూత్ సర్పంచ్ డి.కోటేశ్వరరావు చేతుల మీదుగా రూ.9250 నగదు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాఘవేంద్ర తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులతో పాటు అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

అవ్వాతాతల కంటిచూపు బాగుండాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి



కార్యక్రమంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి, డాక్టర్ నళిని

మద్దిపాడు: అవ్వాతాతల కంటిచూపు చక్కగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం అమలు చేస్తోందని డీఎంఅండ్‌హెచ్‌వో రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని దొడ్డవరం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు మూడో దశ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 సంవత్సరాల పైబడిన వృద్ధులందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేయించి కంటి అద్దాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవ్వాతాతలు చూపు లేక ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మెడికల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ నళిని, ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజు, నాగేశ్వరరావు, ఏఎన్ఎం అనూష, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత.. మణి లెవన్స్ జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హరికృష్ణారెడ్డి, నాయకులు

● బహుమతులు అందజేసిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: పాలడుగు వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న మ్యాచ్ బాల్ ఇన్విటేషన్ క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో యునైటెడ్ ఫ్రెండ్స్ విజయవాడ జట్టుపై గెలిచిన మణి లెవన్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీతో పాటు రూ.లక్ష నగదు బహుమతి అందుకుంది. విజేతలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం హరనాథ్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. తమ మిత్రుడు రాజీవ్, మానిక దంపతులు టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను మణి లెవన్ జట్టు క్రీడాకారుడు సిరాజ్‌షాన్‌బాషాకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా గుంటూరు జిల్లా మాజీ ఇన్‌చార్జి బాబుల్ తుమ్మ చేతుల మీదుగా అందజేశారు.

జూన్ 4న ఏరువాకను విజయవంతం చేయాలి

నాగులుప్పలపాడు: రైతు సంఘాల ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ నిర్వహించనున్న ఏరువాక పౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని రైతు సంఘ నాయకులు చుండూరి రంగారావు, జయంత్‌బాబు కోరారు. త్రోవగుంట సమీపంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఏరువాక కార్యక్రమంపై మండలంలోని ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు, చీర్వానుప్పలపాడు, పోతవరం, అమ్మనబ్రోలు గ్రామాల్లో రైతులకు సోమవారం వారు అవగాహన కల్పించారు.

రూ.కోటితో సిమెంట్ రోడ్డు నిర్మాణం



సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: ఒంగోలు కార్పొరేషన్‌లోని పేర్నమిట్టలో 43వ డివిజన్‌లో గల గణపతినగర్‌లో రూ.కోటితో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు చెంచిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కే రమణయాదవ్, తిరుపతయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

● రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విజ్ఞప్తి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒంగోలు సబర్బన్: దళిత పారిశ్రామికవేత్తలకు రాయితీలిచ్చి ప్రోత్సహించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు దళిత ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఒంగోలు వచ్చిన మంత్రిని స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మన్నం ప్రసన్నరాజు ఆధ్వర్యంలో పలువురు పారిశ్రామికవేత్తలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా ఏపీఐఐసీలోని జీవో నంబర్–7లో ఉన్న క్లాజ్–13ను తొలగించాలని కోరారు. దళిత పారిశ్రామికవేత్తలకు ఏపీఐఐసీ ఇచ్చే సెల్ అగ్రిమెంట్ డాక్యుమెంట్‌లోని క్లాజు–13లో ఉన్న అంశాలు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కొంత ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. దానిని తొలగించి బిఫోర్ ఇంప్లిమెంటేషన్ సేల్ డీడ్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

350 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నాగులుప్పలపాడు: మండలంలోని మాచవరం జెడ్పీ హైస్కూల్లో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి సహకారంతో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 350 మందికి సేవలందించినట్లు కిమ్స్ ఆస్పత్రి పీఆర్వో షేక్.రఫి తెలిపారు. గ్రామ సర్పంచ్ ఇనగంటి సీతారావమ్మ వెంకట రమణారెడ్డి ప్రారంభించగా, కళ్లు, గుండె, సాధారణ వైద్యానికి సంబంధించి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు చెప్పారు.

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటస్వామి

చీమకుర్తి: ఉపాధి పనులు చేసే కూలీలకు వేసవి తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఏపీడీ పీ వెంకటస్వామి సిబ్బందికి సూచించారు. సోమవారం సంతనూతలపాడు మండలంలోని చిలకపాడు, కామేపల్లివారిపాలెంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలకు మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, నీడ కల్పించాలని ఆదేశించారు. కూలీలు చేస్తున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

దాతల సేవలు అభినందనీయం



నగదు అందిస్తున్న ఎస్సై శ్రీకాంత్, శివం ఫౌండేషన్ ప్రతినిధి శ్రీహరి

మద్దిపాడు: సమాజంలో బడుగు, బలహీనవర్గాలలకు అండగా నిలుస్తున్న శివం ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని కొలచనకోట బీసీకాలనీలో రావులపల్లి అనంతలక్ష్మి ఇద్దరు బిడ్డలు మతిస్థిమితం లేక ఫిట్స్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని సోమవారం శివం ఫౌండేషన్ వారు చేరుకున్నారు. ఆమె కుమారుడు నరేంద్ర, కుమార్తె రాధికారాణితో ఆ తల్లి పడుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకుని పోషణ, వైద్య ఖర్చుల నిమిత్తం మద్దిపాడు ఎస్సై బి.శ్రీకాంత్ చేతుల మీదుగా రూ.50 వేల నగదు అందించారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు



మొదటి బహుమతి అందుకుంటున్న జట్టు

ఒంగోలు: స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం రాత్రి డాక్టర్ చిడితోటి జీవన్, జాలాది మణిబాబు, కార్పొరేటర్లు ఎండేటి పద్మావతి రంగారావు, చల్లా తిరుమలరావు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ప్రథమ స్థానంలో నెరుసుల చెన్నయ్య అండ్ విజయకుమారి మెమోరియల్ జట్టు నిలవగా, రెండో స్థానంలో బన్నీ టీం, మూడో స్థానంలో డీఎఫ్ఎస్ జట్టు నిలిచాయి. నిర్వాహకులు పి.బాలు, కె.కరుణ మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి

చీమకుర్తి: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే ఆదిలక్ష్మి తెలిపారు. సంతనూతలపాడులోని గానుగపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక మహిళలనుద్దేశించి సోమవారం ఆమె మాట్లాడారు. మహిళలకు 19 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే తల్లిదండ్రులకు 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. వివాహానికి వెళ్లిన బంధువులను కూడా నేరస్తులుగానే పరిగణిస్తారన్నారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు.

దివ్యాంగుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న వికలాంగులు

కొత్తపట్నం: ఇళ్ల పట్టాల సమస్యపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం దివ్యాంగులు ధర్నా చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆ పార్టీ జిల్లా కన్వీనర్ యోగయ్య పాల్గొని మాట్లాడారు. మోటుమాల పరిధిలో సర్వే నంబర్ 465ఏలో దివ్యాంగులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, దానిని అరికట్టాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లెవలింగ్ చేయించి హెచ్చరిక బోర్డు అమర్చాలని కోరారు. సిబ్బందిని కాపలా పెట్టాలని కూడా కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ బీవీ రమణారావు మాట్లాడుతూ ఇసుక తరలించకుండా బోర్డు ఏర్పాటు చేస్తామని, వీఆర్వోనుగానీ, కానిస్టేబుల్‌నుగానీ కాపలా ఉంచి ఇసుక తరలించకుండా చూస్తామని హామీ ఇచ్చారు. లెవలింగ్ తమ వల్ల కాదని, ఎన్ఆర్ఈజీఎస్‌లో కూడా లెవలింగ్ సౌకర్యం లేదని, ఆ పని మీరే చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించిందని, ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటేనే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

● పరిశీలించిన ఆర్జేడీ నిర్మల్‌కుమార్‌ప్రియ



వెరిఫికేషన్ అనంతరం విద్యార్థులకు రశీదులు అందిస్తున్న ఆర్జేడీ నిర్మల్‌కుమార్‌ప్రియ

ఒంగోలు: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి స్థానిక డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిసెట్ కౌన్సెలింగ్‌ను శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్‌ప్రియ సోమవారం ప్రారంభించారు. తొలిరోజు 1 నుంచి 12 వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరగా, జిల్లా నుంచి 65 మంది మాత్రమే హాజరయ్యారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి ఆర్జేడీ చేతుల మీదుగా వెరిఫికేషన్ రశీదులు అందించారు. ఆర్జేడీ మాట్లాడుతూ జూన్ 5 వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరైన వారు జూన్ 1, 2 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 6వ తేదీతో వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ పూర్తవుతుందని, 7వ తేదీ వెబ్ ఆప్షన్లు చేంజ్ చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. 9వ తేదీ సీట్ అలాట్‌మెంట్ జరుగుతుందని, అనంతరం వారు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకుని 14వ తేదీలోపు సంబంధిత కాలేజీలో రిపోర్టు చేయాలని సూచించారు. జూన్ 15వ తేదీ నుంచి పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన బాలినేని ప్రణీత్‌రెడ్డి



ఒంగోలు: వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి సోమవారం ఒంగోలులో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం నియోజకవర్గంలో పలు సమస్యల గురించి జేసీతో ఆయన చర్చించారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ నెల 31వ తేదీ నగరానికి చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు స్థానిక మస్తాన్‌దర్గా వద్ద ఉన్న శ్రీగోపాలకృష్ణ భగవాన్ దేవాలయంలో స్వామివారి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటారు. 10 గంటలకు టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలో జరిగే పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 11 గంటలకు ఒంగోలు రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన బస్సును ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు రిమ్స్‌లో జరిగే ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొంటారు.

రైతు భరోసా జాబితాలు పరిశీలించుకోవాలి



రాచవారిపాలెం ఆర్‌బీకేలో రైతు భరోసా జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో రమేష్

మద్దిపాడు: వైఎస్సార్ రైతు భరోసా జాబితాలలో రైతులు వారి పేర్లను పరిశీలించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రమేష్ తెలిపారు. సోమవారం మండలంలోని కీర్తిపాడు, రాచవారిపాలెం గ్రామాల ఆర్‌బీకేలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్‌బీకేలో రైతు భరోసా పథకం లబ్ధిదారుల జాబితాలు డిస్‌ప్లే చేయాలని వీఏఏలను ఆదేశించారు. రైతులు వారి పేర్లను జాబితాలో సరిచూసుకోవాలని సూచించారు. జూన్ మొదటి వారంలో రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమవుతుందని తెలిపారు. అనంతరం ఆర్‌బీకేలలో ఫార్మర్ ప్రొడ్యూసింగ్ గ్రూప్‌లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని వీఏఏలను ఆదేశించారు. ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.